సీరియల్

(గత సంచిక తరువాయి)

"మనం మాత్రం మంటల్లోంచి యెలా వెళ్ళగలం?"

"ఇంకా మంటలు పూర్తిగా చుట్టుముట్టలేదు. కాబట్టి మనం వాటిని తప్పించుకొంటూ ముందుకు చొచ్చుకుని వెళ్దాం. సౌమ్య యే చెట్టుచాటునో, గుట్టచాటునో దాక్కొని వుంటే మనల్ని చూసి ఎలాగూ బయటికొస్తుంది. ఆమె యీ ప్రాంతాన్నొదిలి వెళ్ళి ఎంతో సేపు కాలేదు గాబట్టి. ఎంతో దూరం వెళ్ళివుండదు. తేలిగ్గానే కనుక్కోగలమని నా నమ్మకం!"

"ఓ.కే! వెళ్దాం పద."

ఇద్దరు నేలమీది మంటల్ని తప్పించుకొంటూ, మంటలేని చోటికి గెంతుతూ కొంతదూరం వెళ్ళేసరికి ఎదురుగా కాగడాలు చేత ధరించి వస్తూన్న కోయలు కనిపించారు.

విషకన్య నవీన్ చేతిని పట్టుకుని ఓ గుబురు పొద

చాటుకు లాక్కు వెళ్ళింది. అక్కడ మంటలు యింకా వ్యాపించలేదు. దాదాపు డెభ్భై ఎనభై మంది ఆటవికులు హడావిడిగా కాలుతున్న గుడిసెలవైపు పరుగులు పెడుతూ వెళ్ళారు.

విషకన్య నవీన్ వంక సాభిప్రాయంగా చూసి, "ఆ గూడెంవాళ్ళకి సహాయపడటానికి వెళుతున్నారు. నా ఊహే నిజమైతే, సౌమ్య కూడా వీళ్ళను చూసే వుంటుంది. ఏదో సురక్షితమైన స్థలంలో దాక్కుని వీళ్ళ నుంచి రక్షించుకొని వుంటుంది.... పద, వెళ్దాం...." అంటూ ఎత్తై బాటమీదికి నడిచింది.

ఇద్దరు పదిగజాలు వెళ్ళేసరికి పక్కనున్న పొదల్లో ఏదో జంతువు మసలుతున్న సవ్వడి స్పష్టంగా వినిపించింది.

విషకన్య చెవులు దోరపెట్టి విన్నది. ఆమె ఆ సవ్వడి ఏ జంతువుదో తేలిగ్గా గుర్తుపట్టింది.

"పొదల్లో చిరుతపులి పొంచి వున్నది. జాగ్రత్త, యే క్షణంలోనైనా అది మనమీద దాడి చెయ్యవచ్చు. చిరుత చాలా వేగంగా పరుగెత్తటమే కాదు, అంతే వేగంగా దుముకుతుంది ఆహారం మీదికి. వేటాడటంలో బహు నేర్పరి. బి. ఎలర్ట్" అంది.

నవీన్ పొదలవైపు దృష్టిసారించి చూశాడు.

ఓ పక్క చుట్టుపట్ల మంటలు చుట్టుముట్టి వస్తున్నాయి.

* * *

సౌమ్య ఊపిరి బిగబట్టి ఆ శబ్దం వినిపించినవైపు తల తిప్పి చూసింది.

లోపల్నుంచి అదో రకమైన గబ్బువాసన వస్తోంది. పెద్దపులో, సింహమో, మరేదో క్రూరజంతువు లోపల

వున్న మాట నిజం! అది నిద్రావస్థలో వుందో, లేక చేతనావస్థలో వుందో తెలియదు. మనిషి వాసన గుర్తించే జంతువయితే తప్పకుండా తనమీద దాడి చేస్తుంది!

ప్రాణాలతో చెలగాటమాడే బదులు ముందుగా ఆ గుహ నుంచి బయటపడితే మంచిదనిపించింది సౌమ్యకు.

చప్పుడు చేయకుండా బయటికొచ్చేసింది. ఆ మృగం ఆమెని గమనించి వుండదు. లేకుంటే ఆ పాటికే ఆమెను ఖండ ఖండాలుగా చీల్చేసి వుండేది. తన గుహలోకి తనంతగా వచ్చిన ఆహారాన్ని యే క్రూరమృగమూ వదులుకోదు.

బయట యింకా అడవి తగలబడ్తూనే వున్నదనటానికి సాక్ష్యంగా ఎర్రటి వెలుగు కనిపిస్తోంది. మైదాన ప్రదేశమంతా ప్రకాశవంతంగా కనిపిస్తోంది. తను యెవరికయినా యిట్టే కనపడిపోతుంది. కొండగుహను చేర్చి చెట్టుచేమ లున్నాయి. కాని వాటిని చేరుకోవాలంటే మైదానంమీదుగానే నడిచి వెళ్ళాలి.

ఆమె మైదానంమీదికి రాగానే ఒక్కసారిగా అడవి పక్షులు చుట్టుముట్టాయి.

సౌమ్య పై ప్రాణాలు పైనే పోయాయి.

అడవిపక్షులు చీల్చివేయటం ఖాయం!

సౌమ్య వెంటనే వెనుతిరిగి మెరుపు వేగంతో మళ్ళీ అదే కొండగుహలోకి అడుగుపెట్టింది.

అడవిపక్షులు ఆమెను తరుముకుంటూ గుహదాకా వచ్చాయి. మంత్రం వేసినట్టుగ టక్కున నిల్చుండిపోయాయి. ఆ మరుక్షణమే తోకలు కాళ్ళ మధ్యకు తెచ్చుకుని, అక్కడ్నుంచి వేగంగా పరుగుతీశాయి.

సౌమ్య వింతగా చూస్తోంది. ఇంతకీ లోపల నివసి

న్నా జంతువేమిటి? వేటకుక్కల్లాంటి అడవి కుక్కలు భయపడి పరుగెత్తాయంటే అది చాలా క్రూర జంతువే అయివుండాలి!

తను తెలిసి తెలిసి వాళ్ళ యీ గుహలోకే అడుగు పెట్టింది రక్షణ కోసం! అంతటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ఆమెకు నవ్వొచ్చింది. లోపల్నుంచి గుర్రుమంటున్న సవ్వడి వినిపిస్తూనే వుంది.

మనసు చిక్కబట్టుకుని కొద్ది సేపెలాగో కాలక్షేపం చేసింది సౌమ్య. లోపలి జంతువు పైకి లేచిన సవ్వడి మెత్తగా వినిపించింది. బయటికొస్తుందా?

సరిగ్గా అదే సమయంలో బయట్నుంచి ఓ లేళ్ళగుంపు అటుగా పరుగెడుతూ వచ్చింది.

అంతే! గుహ లోపల్నుంచి ఒక్కసారిగా బయటికి ఉరికిన ఆ జంతువును చూసి నిర్ఘాంతపోయింది సౌమ్య.

అది సింహంలా జూలు కలిగివుంది గాని, సింహం కాదు. ఒంటిమీద పెద్దపులికి మల్లే చారలున్నాయి కాని పెద్దపులి కాదు. నోటి నుంచి పొడవాటి రెండు కోరలు బయటికి తన్నుకొచ్చాయి భయంకరంగా. దాని తోక చాలా పొట్టిగా కేవలం అరంగుళాల పొడవు మాత్రమే వుంది!

అది బయటికి వురికిన ఆ కొద్ది సేపట్లోనే విచిత్రమయిన గబ్బు వాసనతో ముక్కులు పగిలిపోయాయి సౌమ్యకు.

అది బయటకు పరుగెత్తిన సమయంలో గుహ గోడకు పూర్తిగా బల్లిలా కరుచుకుని వుండిపోయింది సౌమ్య. అది తనను గమనించిందో లేదో గాని, తన జోలికి రాలేదు. ఎకాఎకిన లేళ్ళ గుంపుపై పడింది. గుహకు పదిగజాల దూరంలోనే మైదానంలో వాటిలో రెండు లేళ్ళను నేల

కరిపించింది.

వాటిని గుహ లోపలకు యీడ్చుకుని వచ్చేలోపల తను బయటపడకపోతే చాలా ప్రమాదమని ఆమె గ్రహించింది.

తెల్యను చంపిన ఆ క్రూరమృగం అక్కడే ఆత్రంగా చీల్చి ఆరగిస్తోంది. తిండి ధ్యాసలో పడి అది పరిసరాలను గమనించటంలేదు.

ఇదే మంచికే నమకుంటూ మెల్లగా గుహగోడల నాను కుని పాకుతున్నట్టుగా బయటికొచ్చింది.

మైదానంలో యింకా వెలుగు పడుతూనే వుంది అడవి యింకా రగులుకుంటూనే వుంది. మంటలు ఉధృతంగా లేవు. గాలి వీయుటంలేదు. అందుకే మంటలు వ్యాప్తి చెందకుండా స్థిరంగా వుండిపోయాయి.

మైదానంలోకి వచ్చిన మరుక్షణంనించీ మళ్ళీ ఎలాంటి మృగాల వాత పడాల్సి వస్తుందోనని చాలా ఎలర్టుగా వుంది సౌమ్య. కొండగుహలవంటి మరుగు ప్రదేశాలు యేవయినా వున్నాయేమోనని పరికించి చూసింది.

బండరాళ్ళు గుట్టలుగా పేర్చినట్టున్నాయి. వాటికి కొంతదూరంలో మళ్ళీ చెట్లు, పొదలు, భీకరంగా కనిపి స్తున్నాయి. చెట్ల మధ్యనుంచి దూరంగా కాగడాల వెలుతురు కనిపిస్తోంది. అక్కడి చెట్లు అగ్ని వాత పడలేదు. మధ్యలో మైదాన ప్రదేశం వుండటంవల్ల మంటలు అంత దాకా వ్యాప్తి చెందలేదు.

సౌమ్య రాళ్ళగుట్ట దగ్గర కొద్దిక్షణాలు ఆగి అలుపు తీర్చుకున్నది. శారీరకంగా అప్పటికే బాగా అలసిపోయి వుండటంతో కళ్ళమీద నిద్ర కూరుకుని రాబోయింది. బలవంతాన నిద్ర నాపుకొన్నది.

ఎప్పుడు పడిపోయిందో ఎక్కడ పడిపోయిందో గాని చేతికి వాచీ లేదు. సమయం ఎంతయిందో ఆమెకు తెలియ లేదు. బహుశా తెల్లవారుఝామున మూడు, నాలుగు గంటలయి వుంటుందని ఊహించింది.

సరిగ్గా అప్పుడే యెక్కడ్నుంచో గుర్రపు డెక్కల శబ్దం వినిపించింది.

సౌమ్య చెవులు రిక్కించి వింది. దూరంగా తనకు కని పించిన కాగడాల వెలుగు మరింత దగ్గరగా వేగంగా ముందుకొస్తోంది. ఆ వెలుగుతో బాటు, గుర్రపు డెక్కల శబ్దం దగ్గరవుతోంది.

ఈ సమయంలో గుర్రాలమీద ఎవరొస్తున్నారు? తను చాలా తేలిగ్గా వాళ్ళ కళ్ళపడిపోయే ప్రమాద ముంది. ఎందుకంటే తను మైదాన ప్రదేశంలో వున్నది. నాలుగువైపుల్నుంచీ యెలాంటి మరుగుప్రదేశం లేదు. చెట్లు చాలా దూరంగా వున్నాయి. ప్రస్తుతం తను దాక్కోవటానికి యీ బండరాళ్ళ గుట్ట తప్ప మరేం కని పించటంలేదు.

సౌమ్య యేమాత్రం ఆలస్యం చెయ్యకుండా బండ రాళ్ళ గుట్టమీదికి ఎగబాకింది. ఏటవాలుగా వున్న బండ రాళ్ళను ఆసరాగా చేసుకొని మెల్లగా గుట్టమీదకు చేరింది. నాలుగువైపుల మరుగ్గా వున్న బండరాళ్ళను వెతుక్కుని వాటిమధ్యకు చేరింది. తను బయటివాళ్ళకు కనిపించకుండా కొన్ని బండలను తన చుట్టూ పేర్చు కున్నది.

ఇప్పుడా బండరాళ్ళ గుట్ట ఆమెకు ఓ కోటలా యేర్ప డింది. ఎవరైనా రాళ్ళగుట్ట ఎక్కి చూస్తే తప్ప, తాను అందులో వున్నట్టు తెలియదు. తనకి మాత్రం మైదానం,

అడవి, మైదానం చివరనుంచి ప్రారంభమైన చెట్లు, అన్నీ స్పష్టంగా కనిపిస్తూన్నాయి.

సౌమ్య గుర్రాలు వస్తూన్న దిశవైపు పరీక్షగా చూస్తోంది. కాగడాలు గుర్రాలమీదున్న వ్యక్తులు చేత ధరించినట్టు గమనించింది.

ఆ వ్యక్తులెవరు? ఈ సమయంలో యెక్కడికి వెళ్తున్నారు?

సౌమ్య దృష్టిసారించి అటే చూస్తోంది.

గుర్రాలు బాగా దగ్గరయ్యాయి. ఇప్పుడా రౌతులు స్పష్టంగా కనిపిస్తూన్నారామెకు.

• • •

పొదల్లో అలజడి తగ్గింది.

నవీన్ ప్రశ్నార్థకంగా చూశాడు విషకన్య వంక.

“చిరుతపులి దూరంగా నడచిపోతున్నది. అడవి తగలబడుతుంటే యెలాంటి క్రూరజంతువైనా తన ప్రాణాన్ని రక్షించుకోవాలని ప్రయత్నిస్తుంది. చిరుతా అదే పని చేసినట్టుంది....” ఆమె మాటలింకా పూర్తికానేలేదు.

ఒక్కసారిగా ఆమె మీదికి చిరుతపులి మహావేగంగా ఉరికింది. ఆ వేగానికి ఆమె దబ్బున నేలమీద పడిపోయింది.

నవీన్ నిర్ఘాంతపోయి చూశాడు. చిరుత ఆమెమీదికి పంజా విసిరింది. తను నిరాయుధుడు! ఆమెకేవిధంగా సహాయపడగలనా అని ఆలోచిస్తూండగానే, విషకన్య చిరుతపులితో తలపడింది.

ఒక స్త్రీలో అంత బలం నిగూఢంగా దాగి వుంటుందని నవీన్ ఎన్నడూ ఊహించలేదు.

విషకన్య ఊహించలేనంత వేగంగా చిరుత పంజా దెబ్బనుంచి తనను తాను రక్షించుకోవటమే కాక, పంజా విసిరిన చిరుత కాలును సుహా వేగంగా మెలిపెట్టింది.

చిరుత ఒక్కసారిగా తలకిందులుగా పక్కకి ఎగిరి పడింది. మరుక్షణమే మహోద్రేకంతో ఆమెమీద తిరగ బడింది.

విషకన్య బొడ్లోంచి పొడవాటి కత్తిని పైకితీసింది. తనమీది కురికిన చిరుత ముఖంమీద కళ్ళ ప్రాంతంలో రెండుసార్లు పొడిచింది.

చిరుత బాధతో పెడబొబ్బ పెట్టింది. దాని కళ్ళు చితికిపోయినట్టున్నాయి, విషకన్యమీదికి వురకబోయి నేలమీదికి ఉరికింది. ఈలోపల దాని డొక్కలో రెండు సార్లు పొడిచింది విషకన్య.

చిరుత మరోసారి ఆమెమీదికి ఎగరబోయి పక్కకి ఉరికింది. విషకన్య మరోసారి దాని పొట్టలో పొడిచింది.

చిరుతపులి రక్తం మడుగులో గిలగిల కొట్టుకుని ఆఖరి శ్వాస విడిచింది.

అంతవరకు కేవలం ప్రేక్షకుడిలా విషకన్య పోరా టాన్ని తిలకిస్తూన్న నవీన్, మంటలు దగ్గరగా చుట్టు ముట్టడంతో స్పృహలోకి వచ్చాడు.

విషకన్య అతన్ని చూసి చిన్నగా నవ్వి, "నన్నే మోసగించబోయింది చిరుత. వెనక్కి వెళ్ళిపోతున్నట్టు నటించి మెరుపు దాడిచేసింది. నేను శత్రువును అంత తేలిగ్గా వదుల్తానా?" అన్నది.

ఆమె చాలా అలిసిపోయింది.

"పద మంటలు యెక్కువయ్యాయి. మన ముందు దారికూడా సరిగమంగా లేదు. అయినా మన ప్రయత్నం

మానకూడదు. ఈ చిరుతపులిలాన దాదాపు యిరవై నిమిషాలు ఆలస్యం!" కత్తిని పచ్చి ఆకుల్తో తుడిచి తిరిగి బొడ్లో దోపుకుంటూ అన్నది.

ఇద్దరు మళ్ళీ ముందుకు నడిచారు.

ఓ అరగంట తర్వాత వాళ్ళు ఓ సమతల ప్రదేశాని కొచ్చారు. అక్కడితో అడవి అంతమైనట్టు కనిపిస్తుంది కొత్తవాళ్ళకి. కాని విషకన్య చెప్పింది విని ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేశాడు నవీన్.

"ఇంతక్రితం అడవిలో పుట్టిన కార్చిచ్చు చాలా దారుణంగా కొన్ని ఎకరాల నేలలో వున్న చెట్లను కాల్చేసింది. కేవలం నుసి మాత్రం మిగిల్చిందంటే నీ కాశ్చర్యంగా వుంటుంది. ఈ మైదాన ప్రాంతం ఒకప్పుడు అంటే, కేవలం మూడు నెలల క్రితం కాలు పెట్టలేనంత దట్టంగా చెట్లతోను, గుబురు పొదలతోను నిండిపోయుండేది. ఇప్పుడు యెలా కనిపిస్తోందో చూడు! అదిగో దూరంగా కనిపిస్తున్న చెట్లు, గుట్టలు, యీ అడవితో కలిసిపోయుండేవి. ఇదంతా మహారాష్ట్రకి చెందిన అరణ్య ప్రాంతం" చెప్పింది విషకన్య.

ముందుకి అడుగు వెయ్యబోతూ చటుక్కున ఆగిపోయింది విషకన్య.

అక్కడ ఓ లేడి కళేబరం వుంది. అంతక్రితమే ఏదో జంతువు తినిపోయినట్టు స్పష్టంగా తెలుస్తోంది. అక్కడికి పదిగజాల దూరంలో కొండగుహ కనిపిస్తోంది.

విషకన్య సాలోచనగా తలూపి, "ఆ కొండ గుహలో యేదో క్రూర జంతువు వుండివుండాలి. కొద్ది నిమిషాల క్రితమే లేడిని వేటాడి తిన్నది" అంది.

నవీన్ ఉలిక్కిపడ్డాడు. అయితే సౌమ్య కేదయినా

ప్రమాదం?!.... తల విదిలించాడు వేదనతో.

విపకన్య అతని వంక ధైర్యం చెపుతున్నట్టు చూస్తూ, "ఇప్పటిదాకా ఆమె కెలాంటి ఆపదా కలగలేదని ఖచ్చితంగా చెప్పగలను. కనుచూపు మేరలో ఆమె ఉనికి మనకు కనిపించటంలేదు. అంటే ఈ మైదాన ప్రాంతానికి ఆమె చేరుకోకపోయి వుండాలి, లేదా అడవికి అవతలి కట్టుకి చేరిపోయి వుండాలి!" అంది.

నవీన్ మౌనంగా వుండిపోయాడు కొద్ది క్షణాలు. ముందుగా విపకన్య దారితీసింది, మైదానం కుడివైపుకి.

ఆమె ఎడమవైపుకి దారితీసివుంటే అక్కడ బండ రాళ్ళ గట్టుమీద నుంచి సౌమ్య వాళ్ళను చూసివుండేది. వాళ్ళు కల్సుకోగలిగి వుండేవారు.

* * *

ఆ రాత్రుల్ని పరీక్షగా చూసింది సౌమ్య.

వాళ్ళు—ఆ అడవిలోకి తాము ప్రవేశించటానికి కారకులయినవాళ్ళు, తాము యిన్ని కష్టాలపాలు కావటానికి కారకులయిన బందిపోటు దొంగలు! ట్రెయిన్ దోపిడి దొంగలు,

అవును, అందులోని బుర్రమీసాలవాడు తనకి బాగా గుర్తు!

ఆ రోజు రాత్రి చెట్టుపై నుంచి నవీన్ తను చూస్తుండగా వాళ్ళు దొంగిలించిన ధనాన్ని యెక్కడో దాచి, మళ్ళీ వెనుతిరిగి అడవి బయటకు వెళ్ళిపోయిన సమయంలో ఆ బుర్రమీసాలవాడ్ని తను బాగా గుర్తుపెట్టుకుంది.

వాళ్ళు మొత్తం ఆయిదుగురున్నారు. తను పన్నెండు మందిని లెక్కించుకున్నట్టు గుర్తు. అంటే యింకా యేడు

గురు యొక్కడో వుండివుంటారు. అయిదుగురు గుర్రాల మీద వేగంగా పోతున్నారు. గుర్రాల మూపుమీద బరువయిన మూట లున్నాయి. దోపిడి సొమ్మయి వుంటుంది!

సౌమ్య వాళ్ళవైపు కసిగా చూసింది. తన చేతిలో ఆయుధముంటే వాళ్ళను ఆ క్షణమే నిలువునా కాల్చేసి వుండేది! కాల్చటానికి అనువైన స్థలంలో బాగా ఎత్తున కూచుని వున్నది. తనని వాళ్ళు గుర్తించేలోపల తను వాళ్ళని చంపేసి వుండేది!

సౌమ్య పిడికిళ్ళు బిగుసుకున్నాయి. కాని తనిప్పుడేం చెయ్యలేని నిస్సహాయ స్థితిలో వున్నది. అవకాశం దొరికినా ఉపయోగించుకోలేని పరిస్థితిలో ఉన్నందుకు తనని తను నిందించుకున్నది.

నవీన్ వుండివుంటే యెంత బావుండేది. కనీసం చేత ఆయుధం లేకపోయినా, బండరాళ్ళను గురిచూసి విసిరేసి చంపేసి వుండేవాళ్ళు ఆ దొంగల్ని. కేవలం అయిదు గురు! క్రూర మృగాల్ని వేటాడినట్టు వేటాడి వుండే వాళ్ళు....

ఆలోచనల మధ్య ఆమె కొద్దిగా పక్కకు ఒరిగింది!

అంతే. ఆమె చేరబడ్డ బండరాయి దొర్లింది. బండ రాయితోబాటు ఆమె కూడా కూలింది.

ఆ మరుక్షణం ఆమె రాళ్ళ గుట్టమీదినుంచి బాలెన్సు తప్పి కిందికి దొర్లిపోసాగింది. మధ్యలో యేదైనా బండను పట్టుకొని బాలెన్సు చేసుకోవటానికి ప్రయత్నం చేస్తూనే వున్నది.

కాని ఆమె ప్రయత్నం ఫలించకపోగా, ఒళ్ళంతా సన్నటి కత్తుల్లాంటి రాళ్ళ కొనలు గుచ్చుకొని గాయాలు

అయిపోయి. కాళ్ళు చేతులు కొట్టుకుపోయాయి.

సౌమ్య గుట్టమీదినుంచి గుట్ట దిగువ భాగానికి అతి వేగంగా దొర్లిపోయింది. అయితే, ఆమె సమతల ప్రదేశానికి—గుట్ట దిగువకు చేరుకునేటప్పటికి ప్రమాదం పొంచి వున్న సంగతి ఆమె గ్రహించేసరికి, ఆమెకు స్పృహ తప్పింది.

• • •

"వెనక నుంచి యేవో గుర్రాలొస్తున్నట్టున్నాయి, డెక్కల శబ్దం వినిపిస్తోంది" అన్నాడు నవీన్.

విషకన్య ఆగి విన్నది. "ఔను, ఎవరో స్వారీ చేస్తూ వస్తూన్నట్టుంది!" అన్నది.

ఇద్దరు వెనుతిరిగి చూశారు.

ముందుగా కాగడాల వెలుగు కనిపించింది. ఆ తర్వాత అస్పష్టంగా రౌతులు స్వారీ చేసుకుంటూ వస్తూన్న గుర్రాలు కనిపించాయి.

"వాళ్ళు ఎవరో మనకు తెలీదు. ఎందుకైనా మంచిది!" అన్నాడు నవీన్.

విషకన్య పరిసరాల్ని ఓసారి చూసి, "కష్టం! మనం మైదానం మధ్యలో వున్నాం. మనకి చేరువలో చెట్టు గాని రాళ్ళగుట్టలు గాని యేమీ లేవు. వాటిని వెతుక్కునే లోపల వీళ్ళు రానే వచ్చేస్తారు.... గెట్ రెడీ, వాళ్లు మనకేదైనా హాని తలపెడితే మాత్రం వాళ్ళను ప్రాణాలతో వదలకూడదు!" ఖచ్చితంగా చెప్తున్న ఆ యువతి వైపు కళ్ళింత చేసుకుని చూసాడు నవీన్. పరిస్థితులు అబలనికూడా అఖండ శక్తిమంతురాలుగా మార్చివేస్తాయనటానికి విషకన్య గొప్ప ఉదాహరణ అనుకున్నాడు.

రౌతులు దగ్గరకొచ్చేశారు.

విషకన్య. నవీన్ మౌనంగా ముందుకి నడుస్తున్నారు.

గుర్రాలు సర్గా వాళ్ళముందుకొచ్చి ఆగిపోయాయి.

నవీన్, విషకన్య రౌతులవంక చూశారు.

సరిగ్గా అయిదు గుర్రాలు, అయిదుగురు రౌతులు.

వాళ్ళకి ముందు భాగంలో గుర్రాల మూపుమీద మూటల్లో యేవో వున్నాయి.

రౌతుల్లో ఒకడు అరిచాడు హిందీలో... "వారే.... వారే, చూడండి! ఇన్నాళ్ళు బతికే వున్నాడు. మనల్నించి తప్పించుకుని బతికి వున్నాడు!" అని.

తక్కిన నలుగురు రౌతులు నవీన్‌ని గుర్తుపట్టారు— నవీన్ వాళ్ళలో బుగ్గమీసాల వ్యక్తిని చూడగానే త్రుళ్ళిపడ్డాడు. వాడు ఆనాటి రాత్రి తమను అడవిపాలు చేసిన బందిపోటు దొంగల్లో ఒకడు!

అవును, పన్నెండుమంది దోపిడి దొంగల్లోనివాళ్ళే యీ అయిదుగురు!

"అరె బచ్చా. మానుంచి తప్పించుకున్నానని సంబరపడిపోకు. దేవుణ్ణి తల్చుకో!" అన్నాడు బుగ్గమీసాల వాడు కర్కశంగా నవీన్ వంక చూస్తూ. వాడి చేతిలోని కాగడా వెలుగులో వాడి ముఖం ప్రళయ భయంకరంగా మండిపోతోంది!

నవీన్ యేమాత్రం తడబడకుండా సూటిగా వాడి ముఖంలోకి చూశాడు.

"ఔరా, నీతో వుండాల్సిన పిల్ల యేదీ? ఇదెవత్తె, కొత్త ముఖంలా వుంది! దీపం వెలుగులో కూడా నల్లగానే వుంది అయినా అందగత్తెలాగానే వుందే!" ఒకడు మేళమాడబోయాడు.

అంతే, ఆ మరుక్షణమే విషకన్య వాణ్ణి గుర్రంమీద నుంచి నేలమీదకు లాగేసింది. కాగా చేత్తో అందుకుని వాడి ముఖాన్ని కాల్చేసింది. ఊహించని ఈ పరిణామం చూసి తక్కిన నలుగురు గుర్రాలమీద నుంచి ఒక్కసారిగా నేలమీదకు దూకేశారు. ఈలోపల విషకన్య వాడి చేతిమీద బలంగా కొరికింది.

అంతే! "మర్ గయారే!" అంటూ చావుకేక పెట్టి వాడు నేలమీదపడి గిలగిల తన్నుకున్నాడు, నోటి చివర్ల నుంచి నురుగొచ్చేసింది.

తక్కిన నలుగురు గన్స్ చేత్తో పట్టుకుని విషకన్య మీద గురిచేశారు.

మెరుపు వేగంతో నవీన్ ఓ బందిపోటుమీదికి దూకి డొక్కలో తన్నాడు. వాడు నేలమీది కొరగేలోపల వాడి చేతిలోని గన్ని చేజిక్కించుకున్నాడు.

ఈలోపల తక్కిన ముగ్గురు విషకన్యమీద గుళ్ళవర్షం కురిపించారు. విషకన్య వాళ్ళ గుర్రాలని చాటు చేసుకుని గుళ్ళదెబ్బల్నుంచి చాలా లాఘవంగా తప్పించుకున్నది.

నవీన్ యీలోపల యిద్దర్ని గురిచూసి కాల్చాడు. వాళ్ళు నేలవాలిపోతూ నవీన్ వంక గురిచూసి కాల్చారు.

కాని యీలోపల విషకన్య గుర్రాల తోకల్ని గట్టిగా కరిచి, ఆ యిద్దరిమీదకు వదిలేసింది. గుర్రాలు పెద్దగా సకిలిస్తూ ఆ రౌతులిద్దరిమీదనుంచి దూకాయి.

అయిదో బందిపోటు విషకన్య వైపు గురిచూసి కాల్చాడు. కాని విషకన్య ఊహించని విధంగా నేల బారుగా దొర్లాడి ఆ గుండు దెబ్బనుంచి కాపాడుకుంది.

ఆ బందిపోటు మరోసారి గన్ సవరించుకునేలోపల అతని చేతిలోని గన్ని ఓ గుండు దెబ్బతో ఎగర

గొట్టేశాడు నవీన్. ఎప్పటికప్పుడు గన్ లోడ్ చేసుకోవటానికి విషకన్య కాటుతో మరణించిన బందిపోటు నడుముకున్న బుల్లెట్ బెల్టులోని గుళ్ళు నవీన్‌కి బాగా ఉపకరించాయి.

అయిదుగురు బందిపోట్లు ప్రాణంకోసం కాసేపు మృత్యువుతో పోరాడి అంతిమశ్వాస వదిలేశారు.

విషకన్య విజయగర్వంతో నవీన్ వంక చూసింది.

నవీన్ ఆమెవంక ప్రశంసాపూర్వకంగా చూసి, "వీళ్ళు నా శత్రువులు, అయిదుగురు చచ్చారు, ఇంకా యేడుగురున్నారు. ఈ అడవిలోనే యెక్కడో ఉండివుంటారు" అన్నాడు.

విషకన్య నవ్వి, "శివా, అయితే నా శత్రువులతో కలుపుకుని మొత్తం పదముగ్గురన్నమాట!" అన్నది.

"అంటే పదముగ్గురు శత్రువులను సంహరించవలసిన బృహత్కార్యం మన భుజస్కంధాల మీదున్నదన్న మాట!" అన్నాడు నవీన్, చచ్చిపడున్న బందిపోట్లవైపు పరిశీలనగా చూస్తూ. వాళ్ళయిదుగురి బుల్లెట్ బెల్టులు తన నడుముకి కట్టుకున్నాడు. రెండు గన్స్ చేతపట్టుకున్నాడు.

విషకన్య యేదో ఆలోచిస్తూ కొద్ది క్షణాలవరకు అలాగే వుండిపోయింది. బందిపోట్లమీద తిరగబడే సందర్భంలో, వాళ్ళమీద గుర్రాలను ఆయుధాల్లాగా ఉపయోగించుకున్నది. తన విషంవల్ల నేలకూలిన ఆయా గుర్రాలు తనని శపిస్తున్నట్టుగా కళ్ళు తేలవేసి చచ్చి పడున్నాయి. ఆ దృశ్యం ఆమె మనసును కలచివేస్తోంది.

మరోపక్క సౌమ్యను కనుగొనలేకపోయినందుకు ఆమె మనసులో చాలా బాధపడుతోంది. ఉగ్రనాగుని, తదితర అనుచర సర్పాలను ఉపయోగించుకోవటానికి వీల్లేకుండా

అడవిలో చిచ్చు రగులుకున్నది. లేకుంటే ఉగ్రనాగు యీసరికి సౌమ్య జాడ కనుక్కొని వుండేది!

తన మాటలకు సమాధానం చెప్పకుండా ఆమె దేని గురించి అంత తీవ్రంగా ఆలోచిస్తోందోనని విషకన్య ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూశాడు నవీన్. ఆమె ముఖంలో అతనాశించిన మార్పులు కనిపించలేదు. సిద్ధి పొందిన మహర్షి లా గంభీరంగా వున్నది.

ఆమె యేదో చెప్పటానికన్నట్టు నోరు తెరిచింది. సరిగ్గా అదే సమయానికి ఉగ్రనాగు, తదితర అనుచర సర్పాలతో అక్కడికొచ్చింది.

విషకన్య సంభ్రమంగా వాటి వంక చూసి, "అరె, మీరెలా వచ్చారు?" అంటూ అడవివైపు చూసింది. అప్పటికి మంటలు పూర్తిగా చల్లారిపోయినాయి కొంత అవకాశం దొరగ్గానే ఉగ్రనాగు తమ దగ్గరకు పరుగెత్తుకొచ్చేసిందన్న మాట!

నవీన్ కూడా వాటి వంక అపురూపంగా చూస్తున్నాడు. విషసర్పాలు పెంపుడు జంతువుల్లాగా ఆమె కనుసన్నల్లో మెలగటం అతనికి చాలా అబ్బురంగా వున్నది!

విషకన్య "ఉగ్రనాగూ! సౌమ్య ఎక్కడుందో చెప్పగలవా? చాలా వేగిరం ఆమెను మేం చూడాలి!" అన్నది.

ఉగ్రనాగు పడగవిప్పి ఆమె చెప్పిందానికి తలూపినట్టు పడగ అటు యిటు ఆడించి తర్వాత వెనుతిరిగి జర జర పాక్కుంటూ వెళ్ళసాగింది. అంతవరకు తాము నడిచివచ్చిన బాటకు వ్యతిరేక దిశలో వెళ్తోంది ఉగ్రనాగు!

అప్పుడు స్ఫురించింది విషకన్యకు—తను కుడివైపుకు కాక ఎడమవైపుకు తిరిగి వుండాల్సిందని! అప్పుడు తాను అందుగురించి అంతగా పట్టించుకోలేదు. గుహకి కుడిపక్క దారిని ఎన్నుకుని ఆ దారిన ప్రయాణం సాగించింది.

మరో అరగంట తర్వాత ఉగ్రనాగు బండరాళ్ళ గుట్టను చేరుకున్నది, నాగుల వెంట నవీన్ విషకన్య అనుసరించి రాళ్ళగుట్టను చేరుకున్నారు. విషకన్య రెండో గన్ నవీన్ దగ్గర్నుంచి అందుకుని చేతపట్టుకుంది.

ఉగ్రనాగు గుట్టకిందిభాగంవైపు పరిశీలనగా చూస్తూ విషకన్యవైపు తలెత్తి సాభిప్రాయంగా చూసింది. ఆ తరవాత ఆ గుట్ట చుట్టుపక్కల వెతకటం మొదలెట్టింది. ఉగ్రనాగుతోబాటు తక్కిన సర్పాలుకూడా తీవ్రంగా అన్వేషిస్తూనే వున్నాయి.

* • •

సౌమ్య గుట్ట కిందికి దొర్లుతుండగానే ఆమెకు స్పృహ తప్పిపోయింది.

ఆమె గుట్టమీదినుంచి దొర్లుతుండగా నలుగురు ఆటవికులు చూశారు. సౌమ్య అంటించిన గుడిసెల్ని ఆర్పటానికి గూడెం వెళ్ళి వస్తూన్న ఆటవికుల్లోని వాళ్ళు. వాళ్ళు! తిరుగు ప్రయాణంలో వాళ్ళకి గుట్టమీదనుంచి దొర్లుతున్న సౌమ్య కళ్ళబడింది. వెంటనే గుట్టదగ్గరకు పరుగెత్తుకొచ్చారు.

అడవి మధ్యలో చిక్కుకుపోయిన ఆ నాగరిక స్త్రీ వాళ్ళకు వింతగా కనిపించింది. గుడిసెల్ని అంటించటమే కాక ఆ అడవి తగలబడటానికి ఆమే కారకురాలని వాళ్ళకు తెలియదు. వాళ్ళలో యిద్దరు అడవి నుంచి యేవో ఆకులు దూసుకొని వచ్చారు. ఆకులు నలిపి పసరును

ఆమె కళ్ళలోను, ముక్కులోను పోశారు.

సౌమ్య అటు యిటు కదిలి కళ్ళు తెరిచింది. ఎదురుగా వున్న ఆటవికుల్ని చూడగానే నిర్ఘాంతపోయింది. ఆ గూడెంవాళ్ళు తనని పట్టుకుపోవటానికే వచ్చివుంటారని భ్రమపడింది. తను వీళ్ళ కళ్ళకెలా కనిపించానో అనుకున్న దో క్షణం. శరీరమంతా తూట్లు పొడిచేసినట్టు విపరీతమయిన బాధ. సలుపు గుర్తింపులోకి రాగానే, గుట్టమీది నుంచి తను దొర్లిపోతుండగా స్పృహతప్పి పడిపోయిన సంగతి గుర్తొచ్చింది. ఇక వీళ్ళనుంచి తప్పించుకోవటం దుస్సాధ్యమని నిర్ణయించుకుంది.

తనవైపు చూసుకున్న దీ సారి. చీర చాలాచోట్ల చినుగులు పడిపోయింది రాళ్ళు గీరుకుని. శరీరమంతా గాయాలతో నిండిపోయింది. ఈసారి తక్కిన యిద్దరు అనుచరులు అడవిలో నుంచి మరికొన్ని ఆకులు తుంచుకుని వచ్చారు. వాటిని పసరు పిండి ఆమె గాయాలమీద పూశారు.... చల్లగా అనిపించి, ఉపశమనం కలిగిందామెకు.

సౌమ్య వాళ్ళవైపు విచిత్రంగా చూస్తోంది. వీళ్ళు తనకి సపర్యలు చేస్తున్నారు. తనంటే వీళ్ళకు కోపం గాని, శత్రుత్వంగాని లేవా?

వాళ్ళు యేవో అడుగుతున్నారు. తనకేమీ అర్థం కావటంలేదు. తనేం చెప్పినా వాళ్ళకు అర్థంకాదు. మౌనంగా వుండటమే మంచిదనుకుంది. వీళ్ళు తను గుడిసెలు తగలపెట్టిన గూడెంవాళ్ళు మాత్రం కాదని నిర్ధారణగా తెలిసిపోయిందామెకు.

సౌమ్య తమ ప్రశ్నలకు సమాధానం చెప్పకపోవటంతో ఆటవికులు కోపంతో చిందులేశారు. ఆమె కావా

లనే మొండిగా ప్రవర్తిస్తున్నదని అనుకున్నారో, ఏమో వాళ్ళ ముఖాలు కోపంతో, అసహనంతో వికృతంగా మారిపోయాయి.

వాళ్ళలో వాళ్ళే ఏదో మాట్లాడుకున్నారు. తనని ఎక్కడికో తీసుకుపోవటానికి నిర్ణయించుకున్నారని వాళ్ళ ముఖకవళికల్నిబట్టి గ్రహించింది. వాళ్ళని ప్రతిఘటించటం అనవసరం. తన శక్తి చాలదు! తటస్థంగా వుండిపోయింది సౌమ్య.

ఇద్దరు ఆటవికులు దగ్గరగా వచ్చి అమాంతం ఆమెను ఒడిసిపట్టుకున్నారు. కెవ్వున అరవబోయి విరమించుకుంది సౌమ్య. వాళ్ళు తనని యెక్కడికో, బహుశా వాళ్ళ గూడేనికి—తీసుకువెళ్తున్నారు. వాళ్ళ నాయకుడి కెవరికో తనని చూపించటానికయివుంటుంది. ఆ తర్వాతైనా వదుల్తారో, తననేం చేస్తారో అనూహ్యం!

సౌమ్యలో తెగింపు, మొండిధైర్యం చోటు చేసుకున్నాయి. రోకట్లో తల దూర్చాక రోకటి దెబ్బకోసం వెరచి లాభం లేదు. నిండా మునిగిన తనకి భయమెందుకు?

సౌమ్య ఆటవికులతో ఆ పరిస్థితుల్లో వున్నప్పుడే సరిగ్గా ఉగ్రనాగు సర్పజాలంతో అక్కడికొచ్చింది. ఉగ్రనాగుకి సౌమ్య యిదివరకే తెలుసు. అందుకే యజమానురాలికి యీ విషయం అందచెయ్యటానికి హుటాహుటిన నవీన్, విషకన్య—వున్న ప్రదేశానికి చరచరా వెళ్ళింది.

విషకన్యను వెంటబెట్టుకుని రాళ్ళగుట్ట దగ్గరకు తీసుకొని వెళ్ళింది.

కాని అప్పటికే ఆ ఆటవికులు ఆమెను తీసుకొని వెళ్ళి

పోయారు. అయినా ఉగ్రనాగు, తక్కిన అనుచర బృందంతో ఆ చుట్టుపక్కల వెతుకుతూనే వుంది.

* * *

"ఉగ్రనాగూ! నాకు వెంటనే సౌమ్య కావాలి. యెందుకింత తాత్సారం చేస్తున్నావు?" అంది విషకన్య అసహనంగా.

ఉగ్రనాగు పడగ అటు యిటు వూపి యజమానురాలు కోపంగా వున్నట్లు గ్రహించి, ముందుకి ఉరికింది, దారితీస్తూ.

మైదానంలోని అడుగుజాడల్ని ఆగి ఆగి పరిశీలనగా చూస్తోంది ఉగ్రనాగు. నాయకుడి వెంటనంటపోయే సైనికుల్లా సర్పాలన్నీ ఉగ్రనాగును అనుసరించి పోతున్నాయి.

మైదానం దాటిపోయి అవతలితట్టు అడవిలో ప్రవేశిస్తూండగా ఊహించని సంఘటన జరిగిపోయింది. ఒక్కసారిగా పదిమంది ఆటవికులు చెట్లమీది నుంచి వాళ్ళమీద దూకారు.

అదురుపాటుగా నడుస్తూ వెళ్తున్న నవీన్ చేతిలోని గన్ యెగిరి దూరంగా పడింది. అయితే విషకన్య ముందుకి తూలబోయి నిలదొక్కుకుంది.

ఉగ్రనాగు గాని, అనుచరసర్పాలు గాని వీళ్ళను గమనించలేదు. అప్పటికే అడవిలో ప్రవేశించి ముందుకి సాగిపోతున్నాయవి.

విషకన్య ఆటవికుల వంక చూసి, గన్ గురిచేసింది.

ఆటవికుల చేతుల్లో పొడవాటి కత్తులు, బరిసెలు వున్నాయి.

విషకన్య వాళ్ళవైపు పరికించి చూసి ఉలిక్కి-

పడింది. "నువ్వా?" అంది ఓ ఆటవికుడి వంక గుచ్చి చూస్తూ.

వాడు వికృతంగా నవ్వాడు. "నేనే! నువ్ రంగు మారినా గురుపట్టలిగాను తాసినావా? మా సింగన్నను. ఆడితో తిరిగిన నన్ను నువ్వు జంపాలనుకుంటుండావని నాకు తెల్వదనుకొన్నావా? అందుకే నిన్నెతుకులాడతా వుండాను. నువ్ జంపాలనుక్కున్నా సింగన్న బతికి లేడు. నేన్నిన్ను జంపడానిక్కె ఒతికుండిన, కాస్కో!" అంటూ చేతిలోని కత్తిని విసురుగా ఆమె మీదికి చర్రున లేపాడు.

తక్కిన ఆటవికులు వికిలిగా నవ్వుతూ వింత తెలకిస్తున్నట్టు వాళ్ళిద్దరివంకా చూస్తున్నారు.

విషకన్య కళ్ళల్లో రక్తజీరలు కనిపించాయి. క్రోధంతోను, ప్రతీకార వాంఛతోను ఆమె రగిలిపోతోంది.

నవీన్ ఆమెకు సహాయపడటమెలాగా అని రెండు క్షణాలు తొట్రుపడ్డాడు. గన్ దూరంగా పడిపోయింది. దాన్ని అందుకోవటానికి ప్రయత్నిస్తే ఆటవికులు తనని ఖండ ఖండాలుగా నరికేస్తారు. అందరు తమ యిద్దర్నీ వలయాకారంలో చుట్టుముట్టి వున్నారు.

విషకన్య చాలా వేగంగా కదిలింది. తనమీదకు విసురుగా లేచిన కత్తిని తుపాకీ బారెల్ తో యెగరగొట్టింది.

ఆ ఆటవికుడు విస్తుపోయి చూశాడు. ఆ వెనువెంటనే రెండో చేతిలోని బరిసెను ఆమె మీద ప్రయోగించబోయాడు.

ఈ లోపల విషకన్య చేతిలోని గన్ను యింకో ఆట

విటుడు బరిసెతో గట్టిగా కొట్టి యెగరగొట్టేశాడు.

విషకన్య నిరాయుధంగా నిలిచిపోయింది. అయితే ఆమె అణుమాత్రం కూడా చలించలేదు.

"నువ్వు నా కోసం చూడటం కాదురా, నేనే నీ కోసం వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నాను" అంటూ తన మీదికి వేగంగా దూసుకొస్తున్న బరిసెపోటు నుంచి లాఘవంగా తప్పించుకుని, యెగిరి వాడి గుండెలమీద తన్నింది విషకన్య.

తక్కిన తొమ్మిదిమంది బరిసెలు కత్తులు ఒక్కసారిగా విషకన్య మీదికి ప్రయోగించబోయారు. కాని ఆ మరుక్షణమే ఆ తొమ్మిదిమందీ నేలమీద విరుచుకుపడిపోయారు. వాళ్ళ గురితప్పి కత్తులు, బరిసెలు దూరంగా పడిపోయాయి. వాళ్ళ నోళ్ళనుండి రక్తం స్రవిస్తుండగా నేలమీద పడి గిలగిల కొట్టుకొంటున్నారు.

విషకన్య విజయగర్వంతో ఆటవికుడివంక చూసింది. ఉగ్రనాగు అనుచర సర్పాలు బుసబుసలాడుతూ ఆ ప్రదేశాన్ని ఆక్రమించేసుకున్నాయి.

ఉగ్రనాగు విషకన్యమీద కత్తిగట్టిన ఆటవికుణ్ని కాటువేయబోతుండగా ఆమె గట్టిగా అరిచి చెప్పింది: "వాణ్ని కాటందుకోవద్దు. వాడి సంగతి నా కొదిలెయ్యి!"

ఆ ఆటవికుడు బాగా భయపడిపోయాడు. అయినా బింకంగానే నిల్చున్నాడు. నేలమీదికి వంగి కత్తుల్ని అందుకోబోయాడు. తన సహచరులు మరణయాతనను అనుభవించటం కళ్ళారా చూశాక, విషకన్యని సర్పాలని మట్టుబెట్టాలనే దృఢనిశ్చయంతో వున్నాడు. అయితే అది జరిగేపని కాదని వాడికి తెలిసినా మొండిధైర్యంతో

కత్తుల నందుకోబోయాడు.

సరిగ్గా అప్పుడే విషకన్య యెగిరి వాడి గుండెలమీద తన్నింది. వాడు నేలమీద పార్లినాడు. చుట్టూ అంగుళం కూడా ఖాళీ లేకుండా సర్పాల మయం!

పడగలమీద నిల్చి మహోగ్రంగా ఫీత్కారాలు చేస్తున్న అన్నిరకాల సర్పాలని చూడగానే వాడి గుండె లవిసిపోయాయి. తన చావు తప్పదనే నిర్ణయాని కొచ్చాడు.

"ఒరే, నా తండ్రిని చంపటానికి ఆ వాయుశితో తులైన ఆ సింగడిని, నీ సహచరు లిద్దర్ని చంపించింది నేనే! నాలుగో వాడివి నువ్వు తప్పించుకున్నా విన్నావిళ్ళు. నిన్ను ఆయుధంతో చంపను, చూడు నిన్నెలా చంపుతానో!" అంటూ వాడి చేతి నందుకుని చీలమండమీద గట్టిగా కరిచింది విషకన్య.

అంతే! మరుక్షణం శరీరమంతా నల్లగా మాడి, నోటినుంచి నురగలు కక్కుతుంటూ విలవిల కొట్టుకుంటూ ప్రాణాలు వదిలాడు ఆ ఆటవికుడు.

విషకన్య ముఖంలో అదోరకమైన ప్రశాంతత, తృప్తి స్పష్టంగా గుర్తించాడు నవీన్.

"మన శత్రువుల లిస్టులోనించి మరొకడు తొలగి పోయాడు. వీడు...." అని చెప్పబోయింది విషకన్య.

"అర్థమయ్యింది. మీ నాన్నగారి శరీరాన్ని ఖండించిన నలుగురు ఆటవికుల్లో వీడొకడు. సింగడ్ని, మరో యిద్దర్ని చంపేయాటమో, చంపించటమో చేశావు. నాలుగోవాణ్ని యిప్పుడు అంతం చేశావు" అన్నాడు నవీన్.

విషకన్య కళ్లల్లో నీరు చిప్పిల్లింది—తండ్రిని తలుచు

పోవటంవల్ల, కాని కొద్ది క్షణాల్లోనే మళ్ళీ మామూలుగా అయిపోయింది.

ఉగ్రనాగు విషకన్య ఆదేశాల కోసం ఎదురుచూస్తు నట్టు తల తిప్పి ఆమెవైపు సాభిప్రాయంగా చూసింది. విషకన్య ఆ మూగభాష తెలుసునన్నట్టుగా, "సౌమ్య దగ్గరకు వేగిరం తీసుకువెళ్ళు!" అన్నది.

నవీన్ కి ఆ దృశ్యం అద్భుతంగా ఉంది. ఓ మానవ స్త్రీ ఆజ్ఞలను బుద్ధిగా పాటిస్తున్న ఆ విషసర్పం మనిషికన్నా వివేకంగా ప్రవర్తించటం చూస్తే ఎవరికయినా విడ్డూరంగాను, నమ్మశక్యం కానిదిగాను అనిపిస్తూంది. కాని ఎదురుగా కనిపిస్తూన్న నగ్నసత్యాన్ని నమ్మకుండా వుండే దెలా?

విషకన్య చెప్పిందే తడవుగా ముందుకు ఉరికింది ఉగ్ర నాగు, అనుచర సర్పాలతో.

నవీన్ యీ లోపల కిందపడ్డ గన్స్ రెండిటినీ తీసి ఓదాన్ని విషకన్య కందించాడు. బుల్లెట్స్ బెల్టులో ఓదాన్ని ఆమె తన భుజానికి తగిలించుకున్నది. ఇరువురు సర్పాల్ని అనుసరించి నడుస్తున్నారు.

అప్పటికి తెల్లవారటానికి అట్టే సమయం లేదు.

• • •

సౌమ్య ఆటవికులతో వాళ్ళ గూడేనికి చేరుకున్న సమయానికి, గూడెం ముందు చాలామంది ఆటవికులు గుమిగూడి వున్నారు. తమ మనుషుల వెంట ఎవరో ఆడ పిల్ల రావటం వాళ్ళ ఆసక్తిని బాగా పెంచింది. అంత వరకు ఆమెని భుజమ్మీద మోసుకొని వచ్చిన ఆటవికుడు ఆమెని నేలమీద దించాడు.

సౌమ్య నిర్లిప్తంగా, వాళ్ళవైపు అనాసక్తిగా చూస్తూ నిల్చున్నది. ఆమె గుండె బండబారిపోయి చాలా సేపయ్యింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటన ఎదురయినా వాటిని ప్రతిఘటించటానికి శక్తి లేనట్టు అలాగే నిల్చుంది.

ఇదివరకటి గూడెం వాళ్ళలాగే యీ ఆటవికులు కూడా నల్లగా తుమ్మమొద్దుల్లా వున్నారు. వాళ్ళ కనుబొమలు దట్టంగా వుండి, చిన్న కళ్ళు గుంటల్లా కనిపిస్తున్నాయి. చూపులు మొరటుగా, రాక్షసంగా వున్నాయి. మొగాళ్ళకి గోచీతప్ప ఒంటిమీద మరేలాంటి ఆచ్ఛాదన లేదు! ఆడవాళ్ళు మొలచుట్టూ ఏదో ఆచ్ఛాదన కట్టుకున్నారుగాని, తక్కిన శరీరమంతా దాదాపు నగ్నంగానే వున్నది. దాదాపు అన్ని విషయాల్లోను వాళ్ళు, కాలిపోయిన గూడెం వాళ్ళలాగే వున్నారు!

'బహుశా యీ రెండు గూడాల వాళ్ళు ఒకే సంతతి వాళ్ళు అయ్యుండాలి!' అనుకున్నది సౌమ్య.

వాళ్ళలో వయసులో బాగా వృద్ధుడిలా కనిపిస్తున్న వ్యక్తి ముందుకొచ్చి ఆ నలుగుర్నీ ఏదో అడిగాడు. అది మరాఠి భాష కాదు. పోనీ 'అనాగరికులు' మాట్లాడే గ్రామ్యభాష కూడా కాదు. పూర్తిగా కొండభాష! తనకి మరాఠి భాష కొద్దిగా తెలుసు. తన అన్నయ్య వుంటున్న నాగపూర్ లో చాలామంది మరాఠి మాట్లాడుతారు.

(సశేషం)